అధ్వానంగా దామ్యతండా రోడ్లు

- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న రహదారులు
- బురద రోడ్లపై వెళ్లాలంటే రైతులు, వాహనదారుల అవస్థలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని దామ్యతండా గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు చిన్నపాటి వర్షం వస్తే చాలు బురదమయంగా మారి రైతులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దామ్యతండా జీపీ పరిధిలోని జేత్యతండా, తుల్సియతండాలకు వెళ్లే ఈ మార్గంలో వర్షం కారణంగా రోడ్డు అధ్వానంగా మారి కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎస్సారెస్పీ కాల్వ వెంబడి తండాలకు వెళ్లే రోడ్డు మార్గం ఇలా ఉండటం వల్ల ఏమాత్రం కొంచెం అదుపు తప్పినా సరే ప్రాణాలమీదకు వచ్చే పరిస్థితులు ఏర్పడనున్నాయి. వానాకాలం పంటల సీజన్ కావడంతో నిత్యం రైతులు పొలం పనులకు వెళ్తున్న క్రమంలో బురద రోడ్డుతో నరకయాతన అనుభవిస్తున్నారు. దామ్యతండా జీపీ కార్యాలయం, స్థానిక ఎంపీపీఎస్ ముందు నుంచి ప్రధాన రోడ్డు మార్గం ఉండగా ప్రతీ ఒక్కరు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ఇటు మల్యాల, అటు పెద్దరామోజీతండా దాకు కూడా వెళ్లే దారి ఇదే కావటంతోపాటు రోడ్డు మార్గం సరిగాలేక మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దామ్యతండా, జేత్యతండా, తుల్సియతండా మూడు తండాలకు ప్రధాన రహదారి కూడా ఒక్కటే అయి ఉండగా వర్షం వస్తే చాలు రోడ్డుపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతుంది. అదేవిధంగా తండాలోని రాజారాం ఇంటి నుంచి శివరాం బావి వరకు వెళ్లే డొంకదారి కూడా చిన్నపాటి వర్షానికే నడిచి వెళ్ల లేక రైతులు పడుతున్న బాధలు అంతా ఇంతా కాదని చెప్పవచ్చు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని తండా వాసులు కోరుతున్నారు.


బురదమయంగా మారిన రోడ్డు


అధ్వానంగా మారిన అంతర్గత రోడ్డు

సమస్యలు పరిష్కరించాలి



గ్రామ పరిధిలోని రోడ్లు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలి. వర్షం వస్తే రోడ్డు మార్గం అధ్వానంగా మారుతుంది. వాహనాలు, రైతులు భయపడుతూ ఎస్సారెస్పీ కాల్వ వెంబడి జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రధాన రోడ్డు మార్గం ఇలా ఉండటం ఆందోళన కలిగిస్తుంది.

– బానోత్ లింగ్యానాయక్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

గూడూరు: మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహ వార్డెన్‌పై చర్య తీసుకోవాలని టీబీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య సురేష్‌నాయక్, ఎస్టీవీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ కోరారు. మానుకోట జిల్లా కేంద్రంలోని ఐటీడీఏ డీడీ ఎర్రయ్యకు శుక్రవారం వసతి గృహంలో వార్డెన్ వ్యవహారం వివరిస్తూ వినతిపత్రం అందించారు. మారుమూల ఏజెన్సీ గ్రామాల నుంచి చదువు కోసం వచ్చే బాలికలపై వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, మెనూ ప్రకారం భోజనం వడ్డించకుండా అడిగిన వారిని బూతులు తిడుతుందని వారు తెలిపారు. ఆమెపై వెంటనే విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బానోతు మోహన్‌నాయక్, జాటోతు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ఎర్రయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహిళా సాధికారత భవనం ప్రారంభం

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సాధికారత భవనాన్ని ఎంపీపీ ఓలం చంద్రమోహన్ శుక్రవారం ప్రారంభించారు. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో మండల మహిళా సాధికారత నిధుల నుంచి రూ.3.50లక్షల నిధులతో భవనాన్ని నిర్మించామన్నారు. భవన స్థలాన్ని బొంత లక్ష్మీ, ఆమె కుమారులు బొంత రాజశేఖర్, అనిల్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత దస్రూనాయక్ , ప్రత్యేక అధికారి తోట శివప్రసాద్, ఏపీఎం రాజేర్, పీఆర్ఏఈ మానస పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకుంటాం


సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

గార్ల: మండలంలోని దుబ్బగూడెంలో సర్వే నంబర్ 821లో గల 1.31 ఎకరాల భూమిలో రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టగా ఇట్టి భూమిని నలుగురు రైతులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నట్లు సర్వేలో తెలిందని తహసీల్దార్ రవీందర్ వెల్లడించారు. ఇట్టి భూమిని నిజాం కాలంలో శ్మశానవాటికకు కేటాయించినట్లు రెవెన్యూ భూరికార్డుల్లో ఉందన్నారు. దుబ్బగూడెం గ్రామస్తులు శ్మశానవాటిక భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల గ్రామస్తులు సమాచార హక్కు చట్టం కింద తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే చేపట్టగా ఇట్టి భూమిని దుబ్బగూడెం, అంజనాపురం గ్రామాలకు చెందిన నలుగురు రైతులు ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. శ్మశానవాటిక భూమిని ఆక్రమించుకున్న రైతులకు త్వరలో నోటీసులు జారీచేసి, వారి నుంచి భూమిని స్వాధీనం చేసుకొని శ్మశానవాటికకు కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

క్యాటరింగ్ టెండర్లలో అవకతవకలు

మహబూబాబాద్ అర్బన్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరం ఆహార పదార్థాల క్యాటరింగ్ టెండర్ల విషయంలో అవకతవకలు జరిగాయని టెండర్‌దారుడు ఇరుగు మనోజ్ కుమార్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని టీజీడబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాల సమీపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అనుభవం లేని మహిళకు, బినామీగా ఉన్న వారికి టెండర్‌ను అప్పగించారన్నారు. ప్రిన్సిపాల్‌కు నచ్చిన వారికి టెండర్‌ను అందించారన్నారు. కలెక్టర్ స్పందించి టెండర్ వచ్చేవిధంగా న్యాయం చేయాలని కోరాడు .

వెదజల్లే పద్ధతిలో పెట్టుబడి ఆదా

గార్ల: వరిపంటలో వెదజల్లే పద్ధతి పాటించడం ద్వారా ఎకరాకు 8వేల నుంచి 10వేల వరకు రైతుకు పెట్టుబడి మిగులుతుందని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. శుక్రవారం గార్లలో వెదజల్లే పద్ధతి ద్వారా వరిపంట సాగు చేస్తున్న రైతు పొలంలో క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్, రైతులు నర్సయ్య పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

నెల్లికుదురు: మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పగిడిపాల తిరుపతక్క అన్నారు. మండలంలోని శనిగకుంట, సొల్లతండా గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యంగా పసిపాపలపై, ఆదివాసి దళిత బలహీన వర్గాల మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్య తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సభలో కాంమ్రేడ్ అనసూర్యఅక్క, దుర్గమ్మ, రజిత, కవిత, ఉపేంద్ర, కనకమ్మ, ఐలమ్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుపతక్క

భూతగాదాలో యువకుడిపై దాడి

మరిపెడ రూరల్: భూ తగదాల కారణంగా ఓ యువకుడిపై కొందరు దాడి చేయగా శరీరమంతా కత్తిగాట్లు పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని భూక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాలోతు తండాలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మాలోతు తండాకు చెందిన మాలోతు బిక్కుకుటుంబానికి, అతని తమ్ముడి భార్య మాలోతు ఈరి, కుమారులైన మాలోతు చంద్రకాంత్, మాలోతు కల్యాణ్ మధ్య కొంత కాలంగా భూ తగదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం బిక్కు నాయక్ తన కుటుంబ సభ్యులు, పెద్ద మనుషులు, ఓ కానిస్టేబుల్‌తో కలిసి గెట్టు రాళ్లు సరి చేయడానికి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న వారి ప్రత్యర్థి వర్గం ఈరి, చంద్రకాంత్, కల్యాణ్ అనుచరులైన మాలోతు ఈకు, జర్పుల దేశ్య, నరేష్, జర్పుల నరేందర్, భూక్య బీక్యతో కలిసి బీక్కుపై దాడి చేశారు. తండ్రిపై చేస్తున్న దాడిని అడ్డుకోవడానికి వచ్చిన మాలోతు రాహుల్‌పై వారు కత్తితో దాడి చేశారు. దీంతో రాహుల్ శరీరమంతా కత్తి గాట్లు ఏర్పడ్డాయి. ఈ సంఘటనపై మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బిక్కునాయక్ పేర్కొన్నాడు.

కళాకారులను విస్మరిస్తున్న పాలకులు


మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య

నెహ్రూసెంటర్: దేశంలో, రాష్ట్రంలో ఉన్న కళాకారులను పాలకులు విస్మరిస్తున్నారని, కళాకారుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, ప్రజానాట్యమండలి నిర్మాణ బాధ్యులు సూర్నపు సోమయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కళలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలను అందించాలన్నారు. జూలై 12, 13, 14 తేదీలలో ప్రజానాట్యమండలి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాకారులు అధిక సంఖ్యలో శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి నక్క సైదులు, జంగం ఉప్పలయ్య, మచ్చ వెంకన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

నెహ్రూసెంటర్: ఆర్టీసీ మానుకోట డిపో అభివృద్ధికి కృషి చేయాలని డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష్యే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లోని విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు కష్టపడి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి బి.శివసాయిరుత్విక్ (విజిత కండక్టర్), ద్వితీయ బహుమతి తంజియా యాస్మిన్ (నబి కండక్టర్), తృతీయ బహుమతి తాజ్‌మహల్ (డ్రైవర్ జమాల్)కు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన ఉద్యోగుల పిల్లలు బి.ప్రసన్న (నిర్మల కండక్టర్), తంజియా యాస్మిన్ (నబి కండక్టర్), ఎం.వరుణ్‌తేజ్ (నర్మద కండక్టర్), ఎస్‌కె. తాజ్‌కమల్ (జమాల్ డ్రైవర్)కు బహుమతులను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం మే నెలలో అత్యధిక ఈపీకే, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, కండక్టర్లు ఉద్యోగస్తులను నగదు బహుమతులతో సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్యాంప్రసాద్, చారి, మల్లికార్జున్, పాపిరెడ్డి, సత్యనారాయణ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం శివప్రసాద్

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

తొర్రూరు: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన మేకల సందీప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీఆర్ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబీకులకు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి అందించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రమాద బీమా ద్వారా కష్టకాలంలో ఉన్నవారిని బీఆర్ఎస్ ఆదుకుంటుందని తెలిపారు. కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని, రానున్న రోజులు బీఆర్ఎస్ పార్టీవేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, నాయకులు కుర్ర శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకన్న, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న దయాకర్‌రావు

విద్యుత్ తీగల తొలగింపు

పెద్దవంగర: మండల కేంద్రంలోని మసీదు వీధిలోని రామకృష్ణ సర్కిల్‌లో గాదరబోయిన సాయిలు ఇంటిపైన ప్రమాదకరంగా నెలకొన్న విద్యుత్ తీగల సమస్యలపై ఇటీవల 'సాక్షి'లో 'ప్రాణాలు పోతేనే స్పందిస్తారా..?' అనే కథనం ప్రచురించింది. దీంతో విద్యుత్ అధికారులు శుక్రవారం విద్యుత్ ఏడీ సీఎస్ చలపతిరావు ఏఈ రమేష్‌బాబు, లైన్‌మెన్ యాకూబ్‌రెడ్డి సిబ్బందితో వచ్చి గ్రామాన్ని సందర్శించి ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించారు. కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి నూతన లైన్ వేయించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

డోర్నకల్: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని జీపీ కార్మికులు కోరారు. పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మున్వర్ అలీకు శుక్రవారం వినతిపత్రం అందించారు.

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

కొత్తగూడ: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సీపీఐ(ఎంఎల్), ప్రజాపంథా నాయకులు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు చిన్న చంద్రన్న మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక చట్టం అమలు కోసం ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, ప్రభాకరన్న, ఎర్రక్క, సమ్మయ్య పాల్గొన్నారు.

మంత్రికి వినతి

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మండల కాంగ్రెస్ నాయకుడు పోలెబోయిన వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

చలో వరంగల్ జయప్రదం చేయండి

గూడూరు: జూలై 7వ తేదీన మాదిగల కవాత్ చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్యమాదిగ శుక్రవారం తెలిపాడు. అనంతరం మండల కేంద్రానికి చెందిన హెచ్.శివను ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ, పత్రాన్ని అందించారు.

పత్తి పంట పరిశీలన

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో పత్తిలో అధిక సాంద్రత పద్ధతి విధానాన్ని పాటిస్తు సాగు చేస్తున్న పత్తి పంటను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారి ఏఓ మంజుఖాన్ పరిశీలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గంగారం: వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాని అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ చంద్రన్న అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు జెజ్జరి సారయ్య, నగేష్ పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

కురవి: మండలంలోని రాజోలు శివారు స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో పాతకోటి ఫిలిప్–పుష్పమ్మ స్మారక ఇమ్మానియేలు చర్చిని శుక్రవారం ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు రిటైర్డ్ ఎక్సైజ్ జాయింట్ డైరెక్టర్ పాతకోటి లాలయ్య–ధనమ్మ ప్రారంభించారు.

కష్టపడ్డ కార్యకర్తలకే ప్రాధాన్యం

మహబూబాబాద్ అర్బన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయం అని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ సీతారాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీతారాం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

మధుయాష్కి గౌడ్‌ను నియమించాలి

గూడూరు: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌ను నియమించాలని సర్దార్ సర్వాయిపాపన్న గీత కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కామగాని యాదగిరిగౌడ్ శుక్రవారం కోరారు.

ఉచిత చేప పిల్లల ప్రక్రియ చేపట్టాలి

నెల్లికుదురు: వివిధ గ్రామాలల్లోని చెరువుల్లో ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ మొదలు పట్టాలని మోపా రాష్ట్ర కార్యదర్శి తోట రమేష్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

కార్పొరేట్ విద్యను అందించాలి

నెల్లికుదురు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి మండలానికి ఒక గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి కార్పొరేట్ విద్యను అందించాలని పూలే బలహీన వర్గ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీని తెలంగాణ బీసీ సంక్షే సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరగాని భిక్షపతి గౌడ్ శుక్రవారం కోరారు.

బదిలీ పీడీకి సన్మానం

బయ్యారం: బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న జి.నాగయ్యను శుక్రవారం ఎంఈఓ పూల్‌చంద్ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవేంద్రాచారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు బస్వ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..



గార్ల: రాంపురం పీఏసీఎస్ డైరెక్టర్ పతంగి సత్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఎంపీపీ బట్టు నాగరాజు, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి దనియాకుల రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రికార్డు బుక్స్ పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని చిల్లంచర్ల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆదే గ్రామానికి చెందిన దాత, వ్యాపారవేత్త సందు మురళీ రికార్డు బుక్స్‌ను శుక్రవారం పంపిణీ చేశాడు. కార్యక్రమంలో హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు కవిత, శ్రీనివాస్, సంతోష్ కుమార్, హరిశంకర్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అందని పాఠ్యపుస్తకాలు

కురవి: పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో సమస్యలపై సర్వే చేశారు. పూర్తి స్థాయిలో స్కూల్స్‌కు పాఠ్యపుస్తకాలు రాలేదన్నారు. అటెండర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

పాఠశాలకు బ్యాండ్ సామగ్రి అందజేత

కేసముద్రం: నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రమేష్ తన తల్లి అరుణసామ్రాజ్యం జ్ఞాపకార్థం శుక్రవారం రూ.3500 విలువైన బ్యాండ్ సామగ్రిని అందజేశారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధితోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ వేణుమాధవ్, ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఇందిరతో కలసి సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మిషన్ భగీరథ సర్వేపై ఎంపీడీఓ వేణుమాధవ్ సమీక్ష నిర్వహించారు.

బావిలో పడి యువకుడి మృతి

నర్సింహులపేట: బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నర్సింహపురంలో జరిగింది. గ్రామానికి చెందిన నిమ్మల బోయిన నరేశ్(26) గురువారం సాయంత్రం గొర్రెలను మేపడానికి వెళ్లాడు. ఈ క్రమంలో గొర్రెలు బావి వైపునకు వెళ్తుండగా వాటిని మళ్లించే క్రమంలో నరేశ్ బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

తొర్రూరు: బాలిక ఆత్మహత్యకు కారణమైన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన డ్రైవర్ సాదు సైదులు చీకటాయపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. శారీరక అవసరాలు తీర్చుకుని బాలికను దూరంగా పెట్టాడు. మోసపోయానని గుర్తించిన బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

తక్షణమే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మరిపెడ రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో పూరి ఇల్లు దగ్ధమై రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లి కట్టు బట్టలతో రోడ్డున పడ్డ బాధిత గిరిజన కుటుంబాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని కోట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జాల్‌తండాకు చెందిన మాలోతు గణేష్, సేల దంపతుల పూరి ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా, బాధిత కుటుంబాన్ని రెడ్యానాయక్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ యువ నాయకుడు తేజావత్ బాలాజీ, మాణిక్యం, ముఖేష్, వెంకన్న, సోమన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి



మహబూబాబాద్: నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నిల్వ నీటిలో చైర్మన్ యాంటీ లార్వా ఆయిల్ బాల్స్‌ను వేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ సీహెచ్ ఉపేందర్, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, కిరణ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ రూరల్: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మల్యాల ఎంపీటీసీ బాదావత్ బద్రిచంద్రు అన్నారు. మండలంలోని రేగడితండా గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో తాగునీటి పైపులైన్, ఎంపీపీఎస్ ప్రహరీ నిర్మాణ పనులకు శుక్రవారం మల్యాల ఎంపీటీసీ బాదావత్ బద్రిచంద్రు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఇస్లావత్ నరేష్, రామచందర్, శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొలగాని రాములు తెలిపారు. పొలిటికల్ సైన్స్, డెయిరీ సైన్స్, సెరీ కల్చర్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందన్నారు. పీజీలో 55శాతం మార్కులు, సెట్, నెట్, పీహెచ్‌డీ, బోధనానుభవం ఉన్నవారికి ప్రాధన్యమిస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 2వ తేది సాయంత్రం 4.30 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 9542110611 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భూమి విరాళం



కొత్తగూడ: గ్రామ ప్రభుత్వ పాఠశాలకు 4గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చి ధాతృత్వం చాటుకున్నాడు. మండలంలోని వేలుబెల్లి గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు భవన నిర్మాణం కోసం స్థలం లేక చాలీచాలని గదుల్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు గమనించిన గ్రామస్తుడు మోకాళ్ల సారంగం పాఠశాలకు తన పొలంలో నాలుగు గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చాడు. ఈ మేరకు భూపత్రాన్ని ఉపాధ్యాయుడికి శుక్రవారం అందజేశాడు.

పీవీ సేవలు చిరస్మరణీయం



తొర్రూరు/గార్ల: దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహరావు జయంతి వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ నాగరాజు, ఎంపీటీసీ వెంకట్‌లాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులే హాజరు



డోర్నకల్: మండలంలోని చాప్లాతండా ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు ఉండగా శుక్రవారం ఇద్దరు విద్యార్థులే పాఠశాలకు హాజరయ్యారు. చాప్లాతండా నుంచి ప్రతీ రోజూ వంద మందికి పైగా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు.

పెద్దమ్మతల్లి బోనాలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం గోపాలపురంలోని ముదిరాజ్‌ల కులదైవమైన పెద్దమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ పెండ్యాల దేవేందర్, బీసీ సంఘ జాతీయ నాయకుడు శంతన్‌రామరాజు, లక్ష్మణ్, ఆలయ కమిటీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.